క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన



వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాత్రాపురం రైతు వేదిక భవనంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీపీఆర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ సీపీఆర్‌పై మండల అధికారులు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంటి నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, తదితరులు ఉన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



వాజేడు: మండల పరిధిలోని నాగారం, జంగాలపల్లి అంగన్ వాడీ కేంద్రాల్లో బుధవారం న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు వాజేడు జెడ్పీటీసీ తల్లడి పుష్పలత, మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ ఎంపీడీఓ విజయ చేతుల మీదుగా ఈ న్యూట్రీషన్ కిట్లను అందించారు.

పశువులు తరలిస్తున్న వాహనాలు స్వాధీనం



ఏటూరునాగారం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల నుంచి అక్రమంగా వరంగల్ వైపు వెళ్తుండగా మండల కేంద్రంలోని అటవీశాఖ చెక్ పోస్టు వద్ద బుధవారం ఉదయం 6 గంటలకు పట్టుకున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. బొలెరో వాహనం, టాటా ట్రాలీలో 14 ఆవులు, బర్రెలు, దుడ్డె, ఎద్దులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనాలను సీజ్ చేసి బలుగూరి రాజేందర్, రాంటెంకి చంద్రశేఖర్, బలుగూరి భద్రయ్య, వడ్లకొండ రాజులపై కేసులు నమోదు చేశామన్నారు. వారిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పశువులను పాల్వంచలోని గోశాలకు సురక్షితంగా తరలించారు.

ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి



మహాముత్తారం: ఏప్రిల్ నుంచి ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నర్సరీల్లో మొక్కలు 100శాతం మొలకెత్తే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీ బ్యాగ్‌లు ఉంటే స్థానిక విత్తనాలు నాటాలని ఉదయం సాయంత్రం నీళ్లు పట్టించి కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం పనులను పూర్తి చేయాలన్నారు. 23వ విడత సామాజిక తనిఖీ బృందం సభ్యులు వస్తున్నందున 2021 నుంచి 2023 వరకు చేపట్టిన పనులకు సంబంధించిన అన్ని రికార్డులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం ఇచ్చిన సిమ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో పోలీసుల పాత్ర కీలకం



మహదేవపూర్: శాంతిభద్రతలతోపాటు ప్రజాసేవలో పోలీస్‌ల పాత్ర కీలకమని సీఐ కిరణ్ అన్నారు. సివిల్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా ఆలోచిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు జీ58 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు అందిస్తున్నట్లు చెప్పారు. సైకిళ్లు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నవమి వేడుకలకు ముస్తాబు



ఏటూరునాగారం: పాలపారకను రామాలయానికి తీసుకొస్తున్న భక్తులు

వెంకటాపురం(కె): వెంకటాపురం మండలంలో నేడు జరుగనున్న శ్రీ రామనవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. మండల కేంద్రలోని జిల్లా పరిషత్ పాఠశాల, అప్పాల వారి వీధితో పాటు మండల పరిధిలోని ఆలుబాక, గొల్లగూడెం, బర్లగూడెం, పాత్రాపురం, సూరవీడు, రామచంద్రాపురం గ్రామాల్లో నవమి వేడుకలకు ఆలయాలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ముస్తాబు చేస్తున్నారు. నవమి వేడుకలను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీలు చలువ పందిల్లు, తాగు నీటి సౌకర్యం కల్పించడంతోపాటు ఆలయాల వద్ద రంగులను వేసి సుందరంగా తీర్చిదిద్దారు.

ఏర్పాట్లు పూర్తి

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి, బుట్టాయిగూడెం, గూర్రేవుల, తుపాకులగూడెం, ఏటూరు, గ్రామాల్లో శ్రీ సీతారాముల కల్యాణానికి భక్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు జరగబోయే రామయ్య పెళ్లికి భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు మండపాలు, విగ్రహాలను సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆలయ కమిటీ సభ్యులు చలువ పందిల్లు వేశారు.

రామాలయానికి పాలపారక అలంకరణ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నేడు నిర్వహించనున్న సీతారాముల కల్యాణ వేడుకల్లో భాగంగా బుధవారం అడవి నుంచి పాలపారకను ఎడ్లబండ్లలో మేళతాళాలలో ఆలయానికి తరలించి చలువ పందిర్లపై అలంకరించారు. పచ్చని పందిరి కార్యక్రమాన్ని చేపట్టినట్లు అర్చకులు యల్లప్రగడ నాగేశ్వర్ రావు తెలిపారు. మామిడి తోరణాలను మండపం, గర్భాలయం, కల్యాణమండపాలకు అలంకరించారు. భద్రాద్రి కొత్తగూడెంలోని భద్రాచలం రామాలయం నుంచి తలంబ్రాలు ఏటూరునాగారం రామాలయానికి వచ్చాయి. క్రాస్‌రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయం నుంచి డీజే సౌండ్స్‌తో మహిళలు, చిన్నారులు ప్రత్యేక వస్త్రాలను ధరించి ఆట పాటలతో కోలాటం ఆడుతూ రామాలయానికి తీసుకొచ్చారని ఆలయ చైర్మన్ మోడెం రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గాడిచర్ల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి చిత్తుబొత్తుల సదానందం, మాజీ చైర్మన్ పోగుల లక్ష్మినారాయణ, వేణుగోపాల్ లాహోటి, కొండాయి చిన్ని, గడదాసు శివ, చెన్నముత్తయ్య, తాళ్లపెల్లి నరేందర్, గడ్డం మహేష్, గడ్డం సదానందం, బచ్చు సత్యనారాయణ, చల్లా సాయి, మాచర్ల వెంకన్నతోపాటు ఆంజనేయస్వామి మాలధారులు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో

మండలంలోని రామన్నగూడెంలో రామాలయంలో హోమ కార్యక్రమాలను చేపట్టారు. సర్పంచ్ దొడ్డ కృష్ణ దంపతులు హోమం, మండపారాధన కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రామాలయం చైర్మన్ కారం పోషాలు, ఉపాధ్యక్షుడుబొల్లె ఆదినారాయణ, కార్యదర్శి ఇట్టం శంకర్, గ్రామస్తులు, భక్తులు, అర్చకులు పుల్లయ్యాచార్యులు పాల్గొన్నారు.

వాజేడు: శ్రీరామ నవమికి సందర్భంగా మండలంలోని రామాలయాలు ముస్తాభయ్యాయి. గురువారం వైభవంగా సీతా సమేత రాముడి కల్యాణ మహోత్సవం జరుగనుంది. దీని కోసం ఆలయ కమిటీలు దేవాలయాలను సిద్ధం చేశారు. మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేశారు. మండలంలోని వాజేడు, చీకుపల్లి, పేరూరు, శ్రీరాంనగర్, మొరుమూరు, పెద్ద గొల్లగూడెం, జగన్నాథపురం, ఏడ్జర్లపల్లి గ్రామాల్లో శ్రీరామ నవవి వేడుకలను నిర్వహించనున్నారు.

రామాలయానికి విరాళం

మండలంలోని మొరుమూరు రామాలయ అభివృద్ధికి బుధవారం నూగూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య విరాళం అందజేశారు. మొరుమూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ నరేష్‌తో పాటు గ్రామ పెద్దలకు రూ.10,001 అందించారు.



కన్నాయిగూడెం: గూర్రేవులలో..



వాజేడు: చీకుపల్లిలో..



వెంకటాపురం(కె): ముస్తాబైన మండపం

ప్రజలకు వసతులు కల్పించాలి



వెంకటాపురం(ఎం): ప్రారంభిస్తున్న వైద్యులు



వాజేడు: శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న క్వాలిటీ టీమ్ సభ్యులు

వాజేడు: మండల పరిధిలోని కోరకల్లులో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా క్వాలిటీ కంట్రోల్ టీ సభ్యులు బుధవారం పర్యవేక్షించారు. కంటి వెలుగు శిబిరానికి వచ్చిన వారితో మాట్లడారు. కార్యక్రమం ఉన్నట్లుగా ఆహ్వాన పత్రికలను ఇచ్చారా? లేదా? దండోరా వేయించారా? లేదా? అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షల కోసం వచ్చేవారికి ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. డాక్టర్ రాజన్న, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, హెచ్ఈ స్వరూప, డీడీఎమ్ ప్రవీణ్ ఉన్నారు.

ప్రారంభమైన కంటి వెలుగు

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్‌నగర్‌లో బుధవారం సర్పంచ్ శనిగరపు రమా రమేష్ ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఒక్కరూ కంటి సమస్యలకు శిబిరాన్ని సందర్శించి పరిష్కారం పొందాలని, అందరూ కంటి వెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. వైద్యులు స్పెషల్ ఆఫీసర్, సంఘమిత్ర, ఏఎన్ఎం ఫాతిమా, ఆశా వర్కర్, ఉపసర్పంచ్ మడికంటి శంకర్, పంచాయతీ కార్యదర్శి దూలం రఘు, భాగ్యలక్ష్మి, రామ నరసయ్య పాల్గొన్నారు.

శిబిరం సందర్శన

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని తహసీల్దార్ అంటి నాగరాజు బుధవారం పరిశీలించారు. శిబిరంలో సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు వైద్య శిబిరాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి భవ్యశ్రీ, సర్పంచ్ చిడెం యామిలి, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీలు కొండపర్తి సీతాదేవి, గార్లపాటి రవి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మౌనం పాటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెంకటాపురం(కె) : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుల ఆత్మకు శాంతికి మౌనం పాటించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ.. ఏప్రిల్ 3వ తేది మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణంలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పిల్లారిశెట్టి మురళి, అధికార ప్రతినిధి దర్రా దామోదర్, బాలసాని వేణు, సీనియర్ నాయకులు వేల్పూరి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

బిజినేపల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో ఎస్సై అశోక్

వాజేడు: మండల పరిధిలోని బిజినేపల్లి గ్రామంలో బుధవారం వాజేడు ఎస్సై అశోక్, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడుతూ.. అవాంఛనీయ సంఘటనలకు తావి ఇవ్వొద్దని తెలిపారు. గ్రామస్తులు కలిసికట్టుగా పనులను చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. గొడవలు పడ వద్దని ఎవరి పనులను వారు చేసుకోవాలని తెలిపారు.

ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తున్న సర్కార్

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలను తెలంగాణ ప్రభుత్వం అణిచివేస్తుందని భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలో తీన్మార్ మల్లన్న టీం ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సత్యనారాయణ రావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రశ్నించే నాయకులపై, విలేకరుల మీద కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. తీన్మార్ మల్లన్న మీద పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి, విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అన్నంత పని చేశాడు..

భార్య, కూతురిని గొడ్డలితో నరికి చంపిన భర్త

- మూడు నెలల నుంచి చంపుతానని బెదిరింపులు
- తప్పించుకున్న కుమారుడు
- నిందితుడిని చితకబాదిన స్థానికులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాములు



నిందితుడి కుమారుడు విశ్వ

భూపాలపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో సైకోగా మారిన ఓ వ్యక్తి తన కుటుంబసభ్యులను చంపుతానని నిత్యం బెదిరించేవాడు. చివరకు అన్నంత పని చేశాడు. పెళ్లి సంబంధం కుదిరిన కూతురిని, భార్యను పైశాచికంగా గొడ్డలితో నరికి చంపిన సంఘటన భూపాలపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లికి చెందిన ఎలకంటి ఆగయ్యకు కుమారుడు రమణాచారి ఉన్నాడు. రమణాచారికి 20 ఏళ్ల క్రితం రమ(35)తో వివాహం జరిగింది. వీరికి ఇంటర్మీడియట్ చదువుతున్న కూతురు చందన(18), కుమారుడు విశ్వ ఉన్నారు. రమణాచారికి అత్తింటి వారు ఇచ్చే వరకట్నం విషయంతో పాటు భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు నెలకొన్నాయి. దీంతో కొన్ని రోజుల పాటు వేశాలపల్లిని వదిలి పట్టణంలోని క్రిష్ణా కాలనీలో నివాసం ఉన్నారు. అక్కడ వడ్రంగి పని చేసుకుంటూ కుటుంబాన్ని సాకాడు. తిరిగి నాలుగు నెలల క్రితం వేశాలపల్లికి వచ్చి ఉంటున్నాడు. మళ్లీ గొడవలు ప్రారంభమై రమణాచారి సైకోగా మారాడు. మూడు నెలలుగా కుటుంబ సభ్యులను చంపుతానంటూ బెదిరింపులకు గురి చేస్తున్నాడు. నిత్యం గొడవ చేస్తుండటంతో స్థానికులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. అయినప్పటికీ అతడి వైఖరిలో మార్పు రాలేదు.

మనుమరాలు పెళ్లి చేద్దామనుకున్న తాత..

రమణాచారి పరిస్థితిని గమనించిన నిందితుడి తండ్రి ఆగయ్య ఇటీవలే మనుమరాలు చందనకు వివాహం చేద్దామని నిశ్చయించుకున్నాడు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ సింగరేణి ఉద్యోగితో పెళ్లిచూపులు కూడా పూర్తయ్యాయి. తాత ఆగయ్య తనకు హనుమకొండలో ఉన్న ఫ్లాట్‌ను అమ్మి వరకట్నం కింద ఇస్తానని హామీ ఇచ్చాడు. ఇందుకు అబ్బాయి తరపు వారు సైతం అంగీకరించారు. ఈ విషయంలో కూడా రమణాచారికి తన తండ్రికి మధ్య వాగ్వాదం నెలకొన్నట్లు సమాచారం.

కాళ్లు మొక్కినా కనికరించలే..

నిందితుడి భార్య రమ బుధవారం వ్యవసాయ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. ఇంటి పనులు చేసుకుంటున్న క్రమంలో డబ్బులు కావాలని రమణాచారి అడిగాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య కాసేపు గొడవ జరిగింది. చివరకు డబ్బులు ఇవ్వడంతో బయటకు వెళ్లి మద్యం సేవించి తిరిగి రాత్రి 6.50 గంటలకు ఇంటికి వచ్చాడు. మరలా గొడవ జరుగగా అడ్డువచ్చిన కూతురు చందనను తొలుత గొడ్డలితో నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందగా, భార్య రమ రోదిస్తూ రమణాచారిని బతిమిలాడసాగింది. అయినప్పటికీ వినకుండా భార్య రమను కూడా గొడ్డలితో నరికి చంపాడు. ఇంట్లోనే ఉన్న కుమారుడు విశ్వ వెంటనే బయటకు పరిగెత్తి 'మా నాన్న... మా అమ్మని, అక్కని నరికి చంపాడు' అంటూ అరిచాడు. వెంటనే స్థానికులు అక్కడికి చేరుకోగా నిందితుడు బయటకు వచ్చి ఎవరైనా అడ్డం వస్తే గొడ్డలితో చంపుతానంటూ బెదిరించాడు. చివరకు స్థానికులు అతడిని పట్టుకొని చితకబాది 108లో ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని భూపాలపల్లి డీఎస్పీ రాములు పరిశీలించగా స్థానిక ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంలో పాఠశాల స్థాయి కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న సీఐ

ములుగు రూరల్(గోవిందరావుపేట): విద్యార్థి జీవితంలో పాఠశాల స్థాయి ముఖ్యమైనదని ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు తమ అనుభవాలను, పాఠశాల అనుబంధాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలన్నారు. సమాజంలో నిలదొక్కుకోవాలంటే క్రమశిక్షణ అవసరమని తెలిపారు. అనంతరం పాఠశాల డిప్యూటీ వార్డెన్ రాములు మాట్లాడుతూ.. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దయాసాగర్, నర్సయ్య, అశోక్, జగపతి, సమ్మయ్య, సత్యనారాయణ, రాజు, మల్లయ్య, లక్ష్మయ్య, కృష్ణమూర్తి, రామేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

మంగపేట: విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలను మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్ అన్నారు. మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం హెచ్ఎం గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని కోరుకుంటు స్వీట్లు తినిపించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులు, గురువులకు, చదువుకున్న పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్‌సీ చైర్మన్ రమేష్‌ను సన్మానించారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రవి, గ్రామ ప్రముఖులు ఎడ్లపెల్లి నర్సింహారావు, హరిబాబు, అశోక్‌రెడ్డి, బొప్పన జ్యోతి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు వీరనారాయణ, రమేష్, సుదీర్‌కుమార్, లావణ్య, ఆనందు, రమాదేవి, జమున, విరాజ్యలక్ష్మి, పావని, పద్మ, ఆస్మాబేగం, మమాదేవి, సుజాత, స్రవంతి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

వెంకటాపురం(కె): విద్యార్థులు చదువులో రాణించాలని వెంకటాపురం సీఐ శివప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుల్లో రాణించి గురువులకు తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. వీడ్కోలు సభలో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం 120 మంది పదో తరగతి విద్యార్థులకు మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు సంతోష్, వెంకటాపురం ఎస్సై తిరుపతి రావు, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కొప్పుల మురళి, నాయకులు అచ్చా నాగేశ్వరావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జయరాజు ఉన్నారు.



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రతిభ చాటిన విద్యార్థినికి చేయూత



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటయ్య

మంగపేట: మండల కేంద్రంలోని ఎక్కటి సరోజిని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2021-2022 విద్యాసంవత్సరంలో బీపీసీ ఆంగ్ల మాధ్యమంలో జిల్లా స్థాయిలో ప్రతిభను చాటిన బండారు మరియకు ప్రిన్సిపాల్ రూ.1,000 నగదును బుధవారం అందచేశారు. జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభను చాటిన విద్యార్థిని ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు నగదును అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువు.. విజ్ఞానంతోపాటు ఉత్తమ జీవితాన్ని అందిస్తుందన్నారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రేణుకాదేవి, సంతోష్‌కుమార్, శైలెందర్, సతీష్‌కుమార్, లక్ష్మణ్, అశోక్, అనిల్‌కుమార్, చిరంజీవి, శ్యామ్, నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థికి

మంగపేట: మండలంలోని తిమ్మంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థి రుక్కయ్య నాయుడుకు మంగపేటకు చెందిన హబీబ్ మెడికల్ స్టోర్ యజమాని ఎండీ గఫార్‌ఖాన్ ఆర్థిక సాయం బుధవారం అందచేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి రోజుల జ్వరంతో బాధపడుతున్నాడు. మరికొద్ది రోజుల్లో 10వ తరగతి వార్షిక పరీక్షలు జరుగనుండటంతో ఆరోగ్యం కుదుట పడి పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గాను 20 ఓఆర్ఎస్ టెట్రాపాకెట్లు, రూ.500 నగదును అందజేశారు.

బాధిత కుటుంబాలకు సీతక్క పరామర్శ

వెంకటాపురం(ఎం): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను కాంగ్రెస్ ములుగు ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాషబోయిన పోశాలు తల్లి మృతిచెందగా అతని కుటుంబాన్ని, ఇదే గ్రామానికి చెందిన మర్రి కోటి, వెంకటాపురం గ్రామానికి చెందిన కుమ్మరి భద్రయ్య, బోనాల భిక్షపతి పాలంపేట గ్రామానికి చెందిన చిడెం నర్సయ్యలు ఇటీవల మరణించగా వారి కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి బాగ్‌వాన్‌రెడ్డి, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ఆకుతోట భద్రయ్య, సీనియర్ నాయకులు మిల్కురి ఐలయ్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగిలి రవి, మూశినపెల్లి కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, నల్ల కోటి, మామిడిశెట్టి స్వామి, బోయిని సుధాకర్ ఉన్నారు.